
పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్‌కు దరఖాస్తులు

బేతంచెర్ల: పాలిసెట్–2023 ప్రవేశ పరీక్షలో అర్హత పొంది ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సీటు రాని విద్యార్థులతోపాటు అర్హత పొందని వారు బేతంచెర్ల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజేష్ తెలిపారు. డిప్లమో ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్సీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. అక్టోబర్ 2లోపు దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు.











డోన్‌ను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి బుగ్గనదే

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో డోన్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసిన ఘనత మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికే దక్కిందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ పేర్కొన్నారు. మంత్రి బుగ్గన జన్మదినం సందర్భంగా మున్సిపల్ గ్రౌండ్‌తోపాటు బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో మంగళవారం నిర్వహించిన షటిల్, కబడ్డీ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. డోన్ నియోజకర్గంలో యాభై ఏళ్లలో జరగని అభివృద్ధిని కేవలం నాలుగేళ్ల మంత్రి బుగ్గన చేసి చూపారని గుర్తు చేశారు. డోన్‌ను ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ఆయన చేస్తున్న కృషిని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. డోన్‌లో కేంద్రీయ విశ్వవిద్యాలయం, పాలిటెక్నిక్, వెటర్నటీ, నర్సింగ్ కళాశాలలు, బీసీ, ఎస్సీ బాల, బాలికల వసతిగృహాలతో పాటు ఉర్దూ పాఠశాలలను మంత్రి బుగ్గన ఏర్పాటు చేశారని వివరించారు. కులవృత్తులను ప్రోత్సహించేందుకు ప్యాపిలి మండలం హుసేనాపురంలో గొర్రెల పెంపకం శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు యువతకు ఉపాధి కల్పించేందుకు డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టుపసాద్, వైస్‌చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, రైల్వే నాగేంద్ర, మహేశ్వర రెడ్డి, కటిక వేణు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కురుకుందు హరి, నాయకులు గజేంద్రారెడ్డి, దినేష్‌గౌడ్, ఆర్ఈ రాజవర్ధన్, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, కోఆప్షన్ మెంబర్ పాతపేట రఫీ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

నేడు మెగా రక్తదాన శిబిరం

డోన్ : ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రతి ఏటా చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని నిర్వాహకులు కౌన్సిలర్ దినేష్‌గౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం మంత్రి బుగ్గన జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక సాయి ఫంక్షన్‌హాల్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కర్నూలు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు.

బాలికల విద్యతో సమాజాభివృద్ధి

డోన్ టౌన్ : బాలికల విద్యతో సమాజాభివృద్ధి చెందుతుందని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి హసీషా తెలిపారు. స్థానిక కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో సెంటర్ ఆఫ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కస్తూర్బా పాఠశాల్లో ఏర్పాటు చేసిన బాలిక విద్యా కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆర్థికంగా, రాజకీయంగా మహిళలు ఎదిగినప్పుడు ఆ కుంటుంబంతో పాటు సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. బ్యాంక్ సీనియర్ మేనేజర్ నవణీకుమార్, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరచిన పది, ఇంటర్ విద్యార్థినులకు పోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోషి, సీనియర్ న్యాయవాదులు నాగభూషణంరెడ్డి, జోన్న లగడ్డ శ్రీనివాసులశెట్టి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి హసీషా

గ్రామీణులకు మెరుగైన వైద్యం

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆధునికీకరించిన ప్రసవాల గది, వార్డును మంగళవారం డాక్టర్లు వినోద్ కుమార్, యమునతో కలిసి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ కొండమీది పల్లెల ప్రజలకు మెరుగైన వైద్యం మరింత చేరువైందని సంతోషం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలో 14 మంది సిబ్బంది పీహెచ్‌సీలో ఉంటున్నారని, దాదాపు 20 పైగానే పరీక్షలు నిర్వహించటానికి ల్యాబ్ అందుబాటులో ఉందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్, పీహెచ్ఎన్ మల్లీశ్వరి, హెల్త్ సూపర్ వైజర్లు వేణు గోపాలరాజు, దానమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


ప్రసవ గదిని ప్రారంభిస్తున్న చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి

పట్టణంలో శ్రమదానం

కోవెలకుంట్ల: మహాత్మగాంధీ జయంతిని పురష్కరించుకుని నిర్వహిస్తున్న పక్షోత్సవాల స్వచ్ఛత సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణంలో శ్రమదానం చేశారు. సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్, ఎంపీడీఓ సయ్యదున్నీసా, ఈఓపీఆర్డీ రాధిక, ఐదు గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పారిశుద్ధ్య కార్మికులు, స్థానిక ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు పట్టణంలోని ప్రధాన వీధులను శుభ్రం చేశారు.


ప్రధాన వీధులను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఎస్‌ఆర్‌బీసీలో గల్లంతైన వలంటీర్ మధుశేఖర్ మృతి



బనగానపల్లె రూరల్ : పట్టణంలోని రవ్వలకొండ సమీపంలో ఎస్ఆర్‌బీసీలో గల్లంతైన వలంటీర్ గట్టుమధుశేఖర్(24) మృతదేహం ఆచూకి మంగళవారం లభించింది. కుటుంబ సభ్యుల వివరాల మేరకు పట్టణంలోని తెలుగుపేటకు చెందిన గట్టు మద్దిలేటి, మాధవీ దంపతుల కుమారుడు మధు శేఖర్ డిగ్రీ పూర్తి చేసి గ్రామ సచివాలయం –5లోని 19వ వార్డులో వలంటీర్‌గా సేవలందిస్తున్నారు. ఆదివారం బహిర్భూమికి రవ్వల కొండ సమీపంలోని ఎస్‌ఆర్‌బీసీ కాల్వ ప్రక్కకు వెళ్లారు. కాల్వలో కాళ్లు శుభ్రం చేసుకుంటూ ప్రమాదవశాత్తు కాల్వలో పడి నీటి ప్రవాహానికి గల్లంతైయ్యారు. మంగళవారం అవుకు మండలంలోని గడ్డమేకలపల్లి గ్రామ సమీపంలోని నీటికుంటలో మధుశేఖర్ మృతదేహం లభించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అవుకు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ఇద్దరికి గాయాలు

డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని దొరపల్లె రైల్వే బ్రిడ్జి సమీపంలో మంగళవారం సాయంత్రం రెండు బైకులు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. యువకుడు ప్రసాద్ డోన్ నుంచి స్వగ్రామం దొరపల్లెకు బైక్‌పై వెళ్తుండగా కర్నూలుకు చెందిన మహబూబ్‌బాషా తన భార్య, కుమారుడితో కలిసి గుత్తి నుంచి బైక్‌పై వస్తున్నాడు. దొరపల్లె రైల్వే బ్రిడ్జి సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం తీవ్రగాయాలైన ప్రసాద్, మహబూబ్‌బాషాలను కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శనగ విత్తనాలు మంజూరు

బేతంచెర్ల: రబీ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం వెయ్యి క్వింటాళ్ల సబ్సిడీ శనగ విత్తనాలను మంజూరు చేసిందని ఏఓ కిరణ్ కుమార్ తెలిపారు. క్వింటాం ధర రూ.8,100 ఉండగా, 40 శాతం రాయితీపోను రైతులు రూ.4,860 చెల్లించాల్సి ఉంటుందన్నారు.



















